ఈ నేపథ్యంలో ఇళ్ల పట్టాలు వచ్చిన జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎస్సారెస్పీ నుంచి ఎన్‌వోసీ రావాల్సి ఉందని, ఎన్‌వోసీ రాగానే నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు న్యాయం జరిగేటట్లు చూస్తామని డీఆర్వో కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. పట్టాలు రద్దు చేసినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం కరీంనగర్‌లో జర్నలిస్టులకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల అంశం రాజకీయ అస్త్రంగా మారింది. ఈ అంశాన్ని రాజకీయంగా మార్చకుండా ఇదే స్థలంలో కరీంనగర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్సారెస్పీ నుంచి ఎన్‌వోసీ జారీ చేసి, పట్టాలు పొందిన తమను స్థలాలల్లోకివెళ్లేలా ఆదేశాలు ఇవ్వాలని జర్నలిస్టులు కోరుతున్నారు. అర్హులై ఉండి పట్టాలు పొందని వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఇళ్ల స్థలాలు పొందకుండా మిగిలిపోయిన వారికి పట్టాలు ఇవ్వాలని జర్నలిస్టులు కోరుతున్నారు. జర్నలిస్టుల కోసం కేటాయించిన స్థలం ఎస్సారెస్పీకి చెందినది. ఎస్సారెస్పీ నుంచి అనుమతులు లేకపోవడం, జర్నలిస్టులకు ఇచ్చిన పట్టాల్లో సర్వే నంబర్లు లేకపోవడం, పట్టాలు పొందిన వారిలో అనర్హులు ఉన్నారంటూ కొంతమంది జర్నలిస్టులు ఫిర్యాదు చేయడం వివాదంగా మారింది. 2006 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 77 మంది జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. అప్పటి నుంచి ఎదురు చూస్తున్న జర్నలిస్టులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పట్టాలు పంపిణీ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లుగా, వీకర్ సెక్షన్ కింద వర్తించే నిబంధనల మేరకు 118 మందికి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఈ స్థలాలపై కొంతమంది జర్నలిస్టులు హైదరాబాద్ వెళ్లి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేయడంతో వారు దీనిపై విచారణ చేపట్టి నివేదికలు సమర్పించాలని కలెక్టర్‌కు సూచించారు. జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై త్రీమెన్ కమిటీని వేసి విచారణ నిర్వహించారు. త్రీమెన్ కమిటీ విచారణ జరిపిన తేల్చిన అంశాలేవి వెల్లడించలేదు. విచారణకు ఆదేశించి ఆరు నెలలు దాటినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీసింది. ఏడాదికాలంగా తమకు కేటాయించిన స్థలాల్లోకి తాము వెళ్లలేని పరిస్థితి ఏర్పడడంతో జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ఒత్తిడి తీసుకువచ్చారు.

పెద్దపల్లిలో కేంద్ర బృందం సభ్యుల పర్యటన

- ఈజీఎస్, ప్రభుత్వ పథకాలపై ఆరా
- పరిశీలించి, ఫొటోలు తీసుకున్న సభ్యులు



మూలసాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 7: మండ లంలోని పలు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యు లు రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. రెండు రోజుల క్రితం నిట్టూరు గ్రామాన్ని సందర్శించ గా సోమవారం రాగినేడు, మూలసాల గ్రామా ల్లో పర్యటించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పెన్షన్‌లు, గ్రామపంచాయతీల్లో రికా ర్డులు, కేంద్రప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి కింద అమలు చేసిన పథకాలు, ఉపాధిహామీ పథకంపై గ్రామాల్లో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. రెండు, మూడేళ్లుగా అమలు చేసిన పథకాలు, అభివృద్ధిలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డు, మురికికాలువలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎలాంటి పథకాలు అమలు అవుతున్నాయో అనే విషయాలపై గ్రామ ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. రికార్డులకు అనుగుణంగా పనులు నిర్వహించారా లేదా.. చేపట్టిన ప్రాంతాలకు వెళ్లి తమ కెమెరాల్లో ఫొటోలు తీసుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు అందించిన పనిది నాలు, గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు వంటివి పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీ లించి గ్రామ ఓటర్లు, కులాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న సభ్యులు బాల మురళి, సునీల్‌కు గ్రామస్థులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వారి వెంట పెద్దపల్లి ఎంపీడీవో ఘనుకోటి శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య, పంచాయతీ కార్యదర్శులు సంతోష్‌రెడ్డి, వెంకన్న నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 7 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలను సోమవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం సోమవారం కొనసాగింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి 28,220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 28,220 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

గన్నేరువరం, అక్టోబరు 7 : బతుకమ్మ పండుగ కోసం గునుగు పూలకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక కాళిదాసు(50)ఆదివారం ఉదయం బతుకమ్మకు వాడే గునుగు పూలను తీసుకొస్తానని భార్య లక్ష్మికి చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం వరకూ తన భర్త ఇంటికి తిరిగి రాక పోవడంతో భార్య గ్రామస్థులను, బంధువులను విచారించింది. ఎవరిని అడిగినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన గుంటుక నారాయణ మూర్తి వ్యవసాయ బావిలో మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. తన భర్త గునుగుపూలను కోసే క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. పండుగపూట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెట్టుకు ఢీ కొని యువకుడి మృతి

ఎండపల్లి, అక్టోబరు 7 : మండలంలోని గుళ్ళకోట గ్రామంలో స్నేహితుడిని ఇంటి వద్ద దించి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం చెట్టు కు ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. వెల్గటూర్ ఎస్‌ఐ ఉమాసాగర్ కథనం మేరకు.. పెద్దపల్లి జిల్లా గొర్రెడ్డిపేట గ్రామానికి చెందిన కాసర్ల సాయికుమార్ (22) ఆదివారం రాత్రి తన స్నేహితుడు పాలకుర్తి సాగర్‌ను గుళ్లకోట గ్రామంలోని ఇంటి వద్ద దించి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో గుళ్లకోటలోని ఐకేపీ కేంద్రం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకతీయ ఉపకాలువలో పడి..

శంకరపట్నం, అక్టోబరు 7: పాడి ఆవుకు పచ్చిగడ్డి కోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన లింగాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి వీరయ్య (50) ఆదివారం సాయంత్రం 4గంటలకు ఆవుకు గడ్డి కోసుకు వస్తానని తన భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి 7గంటలు దాటిన ఇంటికి తిరిగి రాకపోవడంతో తన భర్తకు ఫోన్‌చేయగా, ఫోన్ స్విచాఫ్ రావడంతో వెంటనే తన కుమారులు జగదీష్, అంజి ఇతరులు కలిసి చుట్టు పక్కల గ్రామ శివారులో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం స్థానికులు కాకతీయ ఉప కాలువలో పడి ఉన్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా వీరయ్య కాకతీయ ఉపకాలువలో చెత్తకు తట్టుకొని బోర్లాపడి ఉన్నాడు. వీరయ్య ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని భార్య చల్లూరి రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఒడ్డు పైనుంచి పడి రైతు ..



ఉప్పలయ్య(ఫైల్)

ముస్తాబాద్, అక్టోబరు 7 : మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్ద ఒడ్డు పైనుంచి కాలు జారి కింద పడి మరణించాడు. ఎస్సై సీహెచ్ గణేశ్ వివరాల ప్రకారం.. మండలంలోని నామాపూర్‌కు చెందిన తాడెపు ఉప్పలయ్య(60) అనే రైతు పొలం వద్ద కరెంటు బంద్‌చేసి వద్దామని ఆదివారం సాయంత్రం వెళ్లాడు. ఒడ్డు మీద నుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయి చనిపోయాడు. ఉప్పలయ్య తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూశారు. ఉప్పలయ్యకు దాదాపు రూ.10 లక్షల అప్పు ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరా రు. ఉప్పలయ్యకు భార్య సత్తవ్వ, కొడుకు శేఖర్ ఉన్నారు. కొడుకు శేఖర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో..



అంజయ్య(ఫైల్)

పెగడపల్లి, అక్టోబరు 7: పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన బొమ్మెళ్ల అంజయ్య (53) అనే రైతు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్థులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంజయ్య తన పంట పొలానికి కరెంట్ మోటారు ద్వారా నీరు పెట్టేందు కని సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లాడు. మోటారు స్టార్ట్ చేసి పైపును ముట్టుకోవడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడి కక్కడే మృతి చెందాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోయే సరికి అతని సోదరి సమీప పొలం యజమానికి ఫోన్ చేయగా వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు. మృతుడి భార్య గతంలోనే చనిపోగా ఇంటర్ చదువుతున్న ఒక కూతురు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వీర్నపల్లి, అక్టోబరు 7 : తాళంవేసి ఉన్న ఇంటి తాళం పగుల గొట్టి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్లలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్లాగౌడ్ వివరాల ప్రకారం.. మద్దిమల్లకు చెందిన మాజోజు సత్తయ్య ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లిలో నివాసముంటున్న కుమారుడు ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి సోమవారం సాయంత్రం మద్దిమల్లకు వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా లోని 20 తులాల వెండి గొలుసులు, తులం బంగారం, రూ.20 వేల నగదు చోరీ జరిగి నట్లు గుర్తించాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఎల్లాగౌడ్ పరిశీలించారు. ఈ ఘటనపై సోమవారం రాత్రి బాధితుడు సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఐదుగురిపై కేసు

నెన్నెల, అక్టోబరు 7: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని తప్పుడు అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి మహిళను మోసం చేసిన ఐదుగురిపై మంచిర్యాల జిల్లా నెన్నెల పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బూరం స్వర్ణలతకు విద్యాంజలి పథకంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నెన్నెలకు చెందిన బాపు నమ్మబలికాడు. రూ.1.36 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. మందమర్రికి చెందిన శ్రీనివాస్, గోదావరిఖనికి చెందిన తిరుమల, పెద్దపల్లికి చెందిన పిడుగు రవీందర్ పథకం ప్రకారం తప్పుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ సృష్టించి స్వర్ణలతకు చూయించారు. అది నిజమని నమ్మిన స్వర్ణలత తన బంగారాన్ని కుదువపెట్టి వారికి జూలై 1న డబ్బులు ఇచ్చి ఆర్డర్ తీసుకున్నది. ప్రభుత్వం నూతన పథకం ప్రవేశపెట్టిందని, డీఈవో నుంచి అనుమతి తెస్తామని చెప్పడంతో హెచ్‌ఎం జాయిన్ చేసుకున్నారు. స్వర్ణలత అటెండర్‌గా 40 రోజుల పాటు డ్యూటీ చేసింది. జీతం ఇవ్వాలని హెచ్‌ఎంను కోరగా డీఈవో పర్మిషన్ లేదని, వస్తేనే వేతనం చెల్లించడం సాధ్యమని చెప్పారు. అనుమానం వచ్చి లెటర్ ఇచ్చిన వ్యక్తులను నిలదీయగా రూ.1.36 లక్షల చెక్కు. తిరిగి రాసిచ్చారు. ఆ చెక్కును బ్యాంకుకు తీసుకెలితే బౌన్స్ అయింది. తను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన నలుగురితో, తప్పుడు ఆర్డర్‌ను గుర్తించకుండా 40రోజులు పని చేయించుకున్న హెచ్‌ఎంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అన్నారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు

- స్కందమాత రూపంలో అమ్మవారి దర్శనం
- నంది వాహనంపై రామలింగేశ్వర స్వామి సేవ ఊరేగింపు



ధర్మపురిలో

ధర్మపురి, అక్టోబరు 7: ధర్మపురి రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు ఐదవ రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారలు పసుపు రంగు చీరెలో మల్లె పూలు, బిల్వ పత్రి దండలు ధరించి స్కందమాత రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు అమ్మవారలను దర్శించున్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్థానిక మహిళచే కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయాల్లో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్‌శర్మ, మంత్రోచ్ఛరణల మధ్య మహా రుద్రాభిషేకం జరిపారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారల సేవలు నంది వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. టీటీడీ కళ్యాణ మండపంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.



నంది వాహనంపై శ్రీ రామలింగేశ్వర స్వామి వారల సేవలు ఊరేగింపు

వేములవాడలో..



వేములవాడ కల్చరల్, అక్టోబరు 7 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరా జేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరా త్రోత్సవాలు కన్నుల పండగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం కావడంతో రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు స్కందమాత అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని తరించారు.


మెట్‌పల్లి టీటీడీ కల్యాణ మండపం

నిరుపయోగంగా..

టీటీడీ కల్యాణ మండపం

కరువైన ఆలనా పాలన

పిచ్చిమొక్కలకు నిలయంగా మారిన ఆవరణ

పనిచేయని బోరుతో గేటుకు తాళం

మెట్‌పల్లి, అక్టోబరు 7: వివాహాలు... శుభకార్యాలు... సమావేశాలు జరుపుకోవడానికి వీలుగా మెట్‌పల్లిలో నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిరుపయోగంగా మారింది. కల్యాణ మండపం ఆలానా పాలనా చూసే వారు కరువయ్యారు. దీంతో కల్యాణ మండపం ఆవరణ పిచ్చి మొక్కలకు నిలయంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన కల్యాణ మండపం ప్రస్తుతం పనికి రాకుండా పోయింది. అటు టీటీడీ బోర్డు గానీ, ఇటు ప్రభుత్వం గానీ, దేవాదాయ, ధర్మదాయ శాఖ గానీ పట్టించుకోకపోవడంతో కల్యాణ మండపం రోజురోజుకూ కళా విహీనంగా మారుతోంది.

చెన్నమనేని చొరవతో..

మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు మెట్‌పల్లి ఎమ్మెల్యేగా వ్యవహరించిన సమయంలో పట్టణంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించారు. పట్టణ శివారులో జాతీయ రహదారిని ఆనుకొని సుమారు రెండున్నర ఎకరాల స్థలంలో సుమారు రూ. 30 లక్షల నిధులతో టీటీడీ కల్యాణ మండపం నిర్మించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలి జన్మ భూమి కార్యక్రమంలో భాగంగా 1996లో మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రత్యేక చొరవతో కల్యాణ మండపం ఏర్పాటైంది. 1997 సంవత్సరంలో అప్పటి రాష్ట్ర హోం మంత్రి మాధవరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్ రావులు మెట్‌పల్లిలో టీటీడీ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు.

టీటీడీ ఈ దర్శన కౌంటర్ ఎత్తివేత.....

సుమారు రెండు దశాబ్దాల పాటు కల్యాణ మండపాన్ని పట్టణ ప్రజలు విని యోగించారు. చిన్న చిన్న శుభకార్యాలు, వివాహాలు సైతం తరుచుగా కల్యాణ మండపంలో జరిగేవి. టీటీడీ చేపట్టే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉత్సవాలను సైతం కల్యాణ మండపంలో జరిపేవారు. కల్యాణ మండపం ఆవరణలోనే టీటీడీ బోర్డు ఆధ్వర్యంలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఈ దర్శన బుకింగ్ కౌంటర్‌ను సైతం నిర్వహించారు. 2005 సంవత్సరంలో ఎమ్మెల్యేగా కొమిరెడ్డి రాములు వ్యవహరించిన సమయంలో మెట్‌పల్లిలో టీటీడీ ఈ దర్శన కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ దర్శన కౌంటర్ పనిచేసిన సమయంలో ఉద్యోగులు, సిబ్బంది నిత్యం కల్యాణ మండపానికి భక్తుల రాకపోకలు జరిగేవి. టీటీడీ బోర్డు ఈ దర్శన కౌంటర్‌ను ఎత్తివేయడంతో కల్యాణ మండపం గేటు తాళాలు తెరిచేవారు కరువయ్యారు.

నీటి సౌకర్యం లేకపోవడం వల్లనే....

కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బోరు సుమారు రెండేళ్ల క్రితం ఎండి పోయింది. నూతన బోరు ఏర్పాటుకు టీటీడీ ఉద్యోగులు ప్రతిపాదనలు పంపా రు. టీటీడీ బోర్డు ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో శుభకార్యాల నిర్వహణ సమయంలో నీటి కొరత సమస్యగా మారింది. దీంతో కల్యాణ మండపం ఉపయోగం నిలచిపోయింది. ఇదే సమయంలో కల్యాణ మండపంలోని పలు గదులు, ప్రహరీ, ఇతర కట్టడాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. భవన మరమ్మతులకు సైతం టీటీడీ ఉద్యోగులు బోర్డుకు ప్రతిపాదనలను పంపారు. సంబంధిత ప్రతి పాదనలకు సైతం మోక్షం లభించడం లేదు. దీంతో కొంత కాలంగా కల్యాణ మండపం నిరుపయోగంగా ఉంటుంది. కల్యాణ మండపం ఆవరణ చిన్నరకం అడవిని తలపించే విధంగా పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచెదా రంతో నిండుకుంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకొని కల్యాణ మండపాన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

టీటీడీ బోర్డు స్పందించాలి

దొనికెల నవీన్, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



మెట్‌పల్లిలో నిరుపయోగంగా మారిన కల్యాణ మండపానికి పూర్వ వైభవం తీసుకొని రావడానికి టీటీడీ బోర్డు చొరవ చూపాలి. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్‌రావు సహకా రంతో కల్యాణ మండపం నిర్మాణం జరిగింది. ప్రస్తుతం ఆలనా పాలనా కరువై నిరుపయోగంగా మారడం బాధాకరం. కల్యాణ మండపం ఉపయోగంలోకి తేవాలి. ఇందుకు అవసరమైన చర్యలను టీటీడీ బోర్డు తీసుకోవాలి.



ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన

ధర్మపురి, అక్టోబరు 7: తమ సమస్యలను పరిష్కరించాలని, పాలసీ ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేస్తూ ధర్మపురి పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో ఏజెంట్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. జీవిత బీమా సంస్థ ఏజెంట్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ పాలసీదారులకు పాలసీలపై బోనస్ రేటు పెంచాలని డిమాండ్ చేశారు. జీవిత బీమా సంస్థ ఏజెంట్ల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎల్‌ఐసీ ఎస్‌వో ఎస్‌బీ నర్సయ్యకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్ల యూనియన్ నాయకులు బారతపు గుండయ్య, ఒడ్డేటి భూమయ్య, వేముల భాస్కర్, మల్లేశం, ఉప్పుల రామకిష్టయ్య, రాజన్న పాల్గొన్నారు

సమస్య అధికారుల దృష్టికి తీసుకెళతాం

మెట్‌పల్లి ఆర్డీవో

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 7 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో దేవుని పల్లకి సేవ నిర్వహణలో ఉన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం వెల్లుల్ల గ్రామంలో పర్యటించి శావ కార్యక్రమంలో నెలకొన్న సమస్యను ఇరువర్గాల వివరణ సేకరించడానికి ఎస్సై-2 రాజుకుమార్‌తో కలిసి వివరాలు సేకరించారు. ఇరు వర్గాల తెలిపిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించ డానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

దుర్గా శరన్నవరాత్రోత్సవాలు

రాయికల్, అక్టోబరు 7: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఆలూరు గ్రామంలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవ రాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని కమ్మరిపేట గ్రామంలో దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు దుర్గాదేవికి ఇంటి నుంచి బోనం తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. భీమారం మండల కేంద్రంలో శ్రీ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

కథలాపూర్, అక్టోబరు 7 : మండలంలోని తక్కళ్లపల్లిలో సోమవారం దుర్గామాత సన్నిధిలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారు మహా చండీ దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శక్తి రూపాల్లో అత్యంత మహా శక్తి రూపం కావడంతో నిర్వాహకులు ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు, చిన్నారులు బారులు తీరి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

చీరల పంపిణీ

ఎండపల్లి, అక్టోబర్ 7: మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు సంగ రమేష్ ఆధ్వర్యంలో అమ్మ వారి గుడి వద్ద సోమవారం గ్రామస్థులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. అమ్మ వారి కటాక్షం అందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి..

రాయికల్, అక్టోబరు 7: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రాయికల్ ఎంపీవో సుష్మా అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను సోమవారం ఎంపీవో ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, గుర్రం మహేందర్, మంగళారపు లక్ష్మీనారాయణ, గంగాధర్, మల్లేశం, పీఈటీలు ప్రతాప్, దేవేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసిన ఎంపీవో

జగిత్యాల అర్బన్, అక్టోబరు 7: జగిత్యాల అర్బన్ మండల పంచాయతీ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనుమల్ల వాసవి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలను వారి వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారికి బొకేలను అందజేశారు.

మహిళలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

రాయికల్, అక్టోబరు 7: రాయికల్ పట్టణంలో ఈ నెల 10న నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లను సోమవారం వారు పరిశీలించారు. వీరి వెంట మేనేజర్ వెంకటి, నాయకులు అనిల్, మేకల రమేష్, రామ్మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన సుప్రీంకోర్టు జడ్జి

కోనరావుపేట, అక్టోబరు 7: కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో ఆధునిక హంగులతో నిర్మించిన చల్మెడ జానకి దేవి పాఠశాలను, మల్కాపేట రిజర్వాయర్ కట్ట ప్రాంతంలో నిర్మించిన కోదండరామస్వామి ఆలయాన్ని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పి.సంజయ్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఆయన వెంట రామాలయం, పాఠశాల దాత చల్మెడ లక్ష్మీనరసింహారావు, మధుసూదన్ రావు, అడ్వకేట్ రామారావు, శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వరి లత ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

ఎస్సై సతీష్ కుమార్


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎస్సై సతీష్ కుమార్

గొల్లపల్లి, అక్టోబరు 7: గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎస్సై చిర్ర సతీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో గొల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై లయన్స్ క్లబ్ సేవలను ప్రశంసిస్తూ నిర్వహికులను అభినందించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. మొత్తం 150 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 70 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు చైర్మన్ ముస్కు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీ లయన్ రాజేందర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరహరి, కోశాధికారి సత్యానారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఐక్య సంఘ పట్టణాధ్యక్షుడిగా పోచన్న


ఎన్నుకున్న మున్నురుకాపు కార్యవర్గం

బుగ్గారం అక్టోబరు 7: మున్నురుకాపు ఐక్య సంఘ పట్టణాధ్యక్షుడిగా జాబు పోచన్న సోమవారం ఎన్నికయ్యారు. శ్రీముత్యాలనల్ల పోచమ్మ ఫంక్షన్‌హాల్‌లో మున్నూకారు సంఘం ఆధ్యర్యంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా పోచన్న ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గంజి పరంధం, ఉపాధ్యక్షుడిగా దసర్తి పూర్ణ చందర్, దసర్తి రవి, కోశాధికారులుగా నూర పోశన్న, జంగ ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా కప్పల శంకరయ్యలను నియమించారు. అనంతరం అధ్యక్షులు పోచన్న మాట్లాడుతూ మున్నురు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. నూతన కార్యవర్గాన్ని శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జంగ శ్రీనివాస్, తాడెపు లింగన్న, జక్కుల లింగన్న, మసర్తి రాజిరెడ్డి, పోలంపల్లి మల్లేశం, మదాసు నరేష్, బోనగిరి రాకేష్, గంజి జగన్, కుతురు పోశమల్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోరుట్ల రూరల్, అక్టోబరు 7 : మండలంలోని అయిలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడ్డారు. పాఠశాలలో 2005-2006లో 10వ తరగతి చదివిన విద్యార్థులు గ్రామంలో ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఉపాధ్యాయులను స న్మానించారు. 18 ఏళ్ల తరువాత కలుసుకున్న పాత మిత్రులు యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజిరెడ్డి, లక్ష్మనర్సయ్య, భూమాచారి, నాగేశ్వర్, చాంద్ ఖాన్‌లతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి జువ్వాడి అభినందన

కోరుట్ల, అక్టోబరు 7 : మెడిసన్ సీట్ సాధించిన కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన తుమ్మదీ అక్షితను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సోమవారం అభినందించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన అక్షితతో పాటు అతని తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు. నిరుపేదలకు మంచి వైద్యం అందించి మంచి పేరు తేవాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ ఉమాదేవి-ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కోరుట్ల పట్టణంలోని కోర్టులో ఏజీపీగా నియమితులైన గోనే రాజేష్ ఖన్నాను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సన్మానించి అభినందించారు. తన నియామకానికి సహకరించిన బార్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగారావు, కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు


జగిత్యాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ధర్మపురి, అక్టోబరు 7: ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ ఉత్సవాలు ఆరవ రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని వివిధ వీధుల్లో, గోదావరి నది వద్ద అనేక మంది మహిళలు, యువతులు, చిన్నపిల్లలు రక రకాల పూలతో పేర్చి, అందంగా అలంకరణ చేసిన బతుకమ్మలను ఒక చోట ఉంచారు. అనంతరం మహిళలు, యవతులు, చిన్న పిల్లలు సాంప్రదాయ రీతిలో తెలంగాణ జానపద, బతుకమ్మ, గౌరీ దేవి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. రాత్రి వేళలో బతుకమ్మలను వాడలో ఏర్పాటు చేసిన గుంతలు, కోనేరు, గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని అనేక గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

జగిత్యాల క్రైం: పూలను పూజించే సంస్కృతి ప్రపంచంలోనే రాష్ట్రంలో ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, కోరుట్ల, చొప్పదండి మాజీ ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, రవి శంకర్ సతీమణిలు సరోజన, దీవెనలతో పాటు మాజీ మహిళా జడ్పీటీసీలు, బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవి శంకర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచ రణ్‌రావు ఉన్నారు.


ధర్మపురిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగిత్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం రాత్రి మహిళలు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని మల్లేశం ఐఏఎస్ అకాడమీ, ధర్పణ్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమంలో మహిళలు బతుకమ్మ ఆడి పాడారు. బతుకమ్మ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు బహుమతులు అందజేసినట్లు ఆర్గనైజర్ రామినేని ఆశ్రిత చౌదరి తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకం పరిశీలన

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 7 : మండలంలోని చిం తలపేట గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన మదర్ యూనిట్ లోని పెరటి కోళ్ల పెంపకాన్ని డీపీఎమ్ సూదం వెంక టేష్ సోమవారం పరిశీలించారు. మహిళలకు ఆ ర్థిక సాధికారత కల్పించడానికే ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తిలోని మదర్ యూనిట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మదర్ యూనిట్‌లో భాగంగా మంజూరైన గ్రామా నికి చెందిన మహిళా సంఘ సభ్యురాలు ఉత్కం పద్మ కు శ్రీనిధి నుంచి రూ. 2.91లక్షల రుణాన్ని మంజూరు చేశామన్నారు. యూనిట్‌లో కోడి పిల్లలను 45 రోజుల పాటు పెంచిన అనంతరం గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు అమ్మేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఫాం ఉస్సేన్, విమోచన, సీసీ సూర య్య, వీవోఏ తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

పంపిణీకి ఏర్పాట్లు

కథలాపూర్, అక్టోబరు 7 : మహిళా సంఘాలకు పెర టి కోళ్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు సెర్ప్ ఏపీ ఎం నరహరి తెలిపారు. సోమవారం పెరటి కోళ్ల మదర్ యూనిట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం మండల కేంద్రం లో మదర్ యూనిట్‌లో 3 వేల కోళ్లను పెంచుతున్నా మని ఆసక్తి ఉన్న మహిళలు తీసుకెళ్ల వచ్చని సూచిం చారు. ఒక్కో మహిళకు 50 కోళ్లను యూనిట్ ప్రాతిప ది కన అప్పు పొంది కోళ్లను తీసుకు వెళ్లాలని కోరారు.

దాడులకు పాల్పడితే కేసులు

మల్లాపూర్, అక్టోబరు, 7 : గ్రామాల్లో దాడులకు పాల్పడితే రౌడీషీట్ కేసులు ఓపెన్ చేస్తామని మల్లాపూ ర్ ఎస్సై కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని వేంపల్లి గ్రామంలో గొడవలకు పాల్పడిన వారిపై సోమ వారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన భూక్య రాము, భూక్య లక్ష్మణ్ అన్నదమ్ములు గ్రామంలోని మొండే వినోద్‌ల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుర్గాదేవికి సహస్ర దీపాలంకరణ


కొడిమ్యాలలో దుర్గాదేవి వద్ద సహస్ర దీపాలంకరణ

కొడిమ్యాల, అక్టోబరు 7 : కొడిమ్యాలలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గాదేవికి నవ రాత్రోత్సవాల్లో బాగంగా సోమవారం రాత్రి భక్తులు సహస్ర దీపాలంకరణను చేశారు. వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ ఆద్వర్యంలో సునిల్ భవానీ బృందంతో బోనాల ఊరేగింపు పండగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కొడిమ్యాల ఎస్సై సందీప్, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

అక్కడిక్కడే యువకుడి మృతి

మల్లాపూర్, అక్టోబరు, 7 : మండలంలోని సంగంశ్రీరామ్‌పూర్ గ్రామంలో గ్యాస్ సిలిండర్ ఆటోను ఢీకొని అడ్లూరి నర్సయ్య(40)అను వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్లు సోమవారం ఎస్సై కిరణ్‌కుమారు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అడ్లూరి నర్సయ్య పనులు నిమి త్తం మండలంలోని పాతధాంరాజుపల్లి గ్రామా నికి తన ద్విచక్ర వాహనం టీఎస్02 ఈఎమ్ 7715 నంబర్ గల వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో సంగంశ్రీరాంపూర్ గ్రామంలో గ్యాస్ సిలిండర్ ఆటో టీఎస్01యూసీ5180 నంబర్ గల వాహాన్ని డ్రైవర్ ముష్కరి ప్రసాద్ అకస్మాత్తుగా రోడ్డుపై నిలపడంతో వెనుకల వాహనంపై వస్తున్న అడ్లూరి నర్సయ్య ద్విచక్ర వాహనం ఢీకొట్టుకున్నాడు. దీంతో నర్సయ్య తీవ్ర గాయాల పాలై అక్కడిక్కడే మృతి చెందాడని భార్య అడ్లూరి లక్ష్మి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోనాల పండుగ


మల్లాపూర్‌లో బోనాలతో భక్తుల ఊరేగింపు

కోరుట్ల, అక్టోబరు 7: శరన్నవరాత్రోవ్సవాలలో భాగంగా పట్టణంలోని కోటి నవదుర్గ, దుర్గాదేవి, తిశక్తి దేవాలయాలతో పాటు పట్టణంలోని వివిధ దేవాలయ నిర్వహకుల ఆధ్వర్యంలో బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలతో శోభయాత్ర నిర్వహించగా పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

వెల్గటూర్: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో మహిళలు పెద్ద సంఖ్యలో సోమవారం దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకొని ఊరేగింపుగా గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి దుర్గమ్మను నెలకొల్పిన మంటపానికి ఊరేగింపుగా చేరుకున్నారు.

మల్లాపూర్: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని భక్తులు దుర్గాదేవికి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన దురాదేవిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనను శాలువతో సన్మానించారు. రాఘవపేటలో అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దర్శించుకున్నారు. నిర్వాహకులు శాలువతో సన్మానించారు. మొగిలిపేటలోని శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయంలో వీడీసీ పల్లకిసేవ నిర్వహించారు.


కోరుట్లలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు